

# బలి

**ఇంద్రగంటి జానకీబాల**

నాగమ్మ పొయ్యిలోని చితుకులు గుప్పుమని అంటుకున్నాయి.

ఎండిన పోరుగుల్లా వున్న ఆ పుల్లలు అంతలోనే చురచుర నాలుగువైపులకీ మండడం మొదలుపెట్టాయి. బియ్యం కడిగిపెట్టుకున్న కుండ పొయ్యిమీద పెట్టి, చట్టి మూత పెట్టి పుల్లలు నెమ్మదిగా కదుపుతూ అక్కడే కూర్చుంది.

ఎర్రని మంటలు నల్లని ఆమె ముఖంలో ప్రతిఫలిస్తూ వికృతంగా నాట్యం చేస్తున్నాయి. నాగమ్మ తీవ్రంగా ఆలోచిస్తోంది. ఏదో దృఢ నిర్ణయానికొచ్చినట్టు ఆమె ముఖం నల్లరాయిలా బిగుసుకుపోయింది.

అరగంట క్రితం అచ్చమ్మ వచ్చి,

"బెజవాడ వెల్దాం రాయే నాగూ" అంది.

"ఏంటీ? ఎక్కడకి" అంటూ నాగమ్మ తెల్లబోయింది. అయినా ఆమె ముఖంలో బెజవాడ లాంటి పట్టణం చూడాలన్న కోరిక అర సెకనులో గుండెలంతా వ్యాపించి ఊపిరాడనివ్వలేదు.

"ఏంటే ఎర్రిమొగవా! ఆళ్ళే బస్సులో తీసుకెళ్తారంట, ఆళ్ళే అన్నవెడతారంట, మళ్ల బస్సులో తీస్కొస్తారంట" - అని చెవిలో రహస్యంగా "ఇరవై రూపాయిలు కూడా ఇస్తారంట" అంది అచ్చమ్మ.

ఆ క్షణం నుంచి నాగమ్మ మనస్సు మనసులో లేదు. ఎలాగైనా ఈ అవకాశం వదులుకోకూడదు. పుట్టి ఇరవై ఏళ్ళయినా బస్సే ఎక్కలేదు. రోడ్డంట బస్సు వస్తుంటే, పోతుంటే నోరెల్లబెట్టి చూడ్డమే గానీ, ఎప్పుడూ ఆ బస్సుని తాకనైనా లేదు. అయినా తను బస్సు ఎక్కే అవసరమేముంది? నాలుగుమైళ్ళ దూరంలో అమ్మోళ్ళు- అత్తోరిల్లు పక్కనే- నడిచిపోయి నడిచొచ్చే దూరం. నాగమ్మకి తెలుసు అత్తగారు ముందస్తుగా ఏదైనా సరే వద్దనేస్తుంది. అందుకే ముందామెని మాట్లాడనీకుండా, మొగుడికి చెప్పి ఎళ్ళిపోవాలి.

ఇరవై రూపాయిల్లో రంగుల రాట్నం తిరగొచ్చు, ఎర్రని, పచ్చని గాజులు కొనుక్కోవచ్చు.

నులక మంచంలో నిద్రపోతున్న తొమ్మిది నెలల పిల్లాడు కెవ్వున ఏడవడంతో బాలనాగమ్మ ఊహల్లోంచి తేరుకుంది. కొయ్య తెడ్డుతో అన్నం కలియబెట్టి వంచేసింది. ఉల్లిపాయ కారం నూరుతూ పిల్లాడిని ఒళ్ళో వేసుకుని పాలు నోట్లో పెట్టింది. వాడు ఏడుపు ఆపి నిద్రలోకి జారుకున్నాడు. నాగమ్మ తన ఊహల్లోంచి వ్యూహాలు ఆలోచిస్తోంది. మొగుడు కూడా అంత త్వరగా ఒప్పుకోడు. తనెంతో కష్టపడి అతన్ని ఒప్పించాలి.

ఏం వొప్పుకోక? తనేం డబ్బులడగడం లేదుగా అన్నీ ఆళ్ళే పెట్టుకుంటారంటగా-, కోటప్పకొండ జాతర కెల్దామని ఎన్నాళ్ళనుకున్నా, ఎప్పుడూ ఏదో సాకు సెప్తాడు. మొదట్లో డబ్బుల్లేవంటాడు. నిజవే! మరి కూలి చేసుకుని గుట్టుగా బతికేటోళ్ళకి జాతర్లకి, తీర్థాలకి డబ్బు లేడనుంచి వస్తాయి!

ఎన్నో రకాల ఆలోచనలు నాగమ్మ బుర్రలో రొద చేస్తున్నాయి. ఆలోచించినకొద్దీ ఆమెకి కోరిక బలపడుతోంది. ఇంత చక్కటి, గొప్ప అవకాశం మళ్ళీ జన్మలో రాదు అని అరగంటలో ఆరువందలసార్లు అనుకుంది. రత్తాయమ్మ వస్తూనే రంకె లేయడం మొదలెట్టింది.

"ఏంటే నాగులూ బెజవాడెల్తానని అచ్చమ్మగ్గానీ చెప్పావా?" అంది. అంత దృఢంగా నిర్ణయించుకున్నా చటుక్కున అత్త అడిగేసరికి తెగేసి చెప్పలేకపోయింది నాగమ్మ.

"అక్కడ అగ్గంటుకుపోతోంది, చంటాడ్ని కూడా తీసుకెళ్తావు? కూడెలాగా, నీళ్ళెలాగా?" అంది. అదే శ్రుతిలో నాగమ్మ చెప్పింది.

"ఏమో నాకు తెలవదు- ఆడొచ్చాక అడుగు" అంది. అత్తంత సులువుగా తేలుస్తుందనుకోలేదు. అందుకే నాగమ్మ మనసు నాట్యం చేసింది.

* * *

బస్సులో ఎక్కి కూర్చునేసరికి, ఎంత యిరుకుగా కూర్చున్నా, నాగమ్మ ఏనుగెక్కినంత సంబరపడింది. అచ్చమ్మ సలహా మేరకు పిల్లాడ్ని దారిలో అచ్చమ్మ అప్పగారింట్లో వదిలేసి, మళ్ళీ వచ్చేప్పుడు తెచ్చుకునేలా నిర్ణయించుకుంది. పిల్లాడ్ని కొత్తవాళ్ళ దగ్గర వదిలి వెళ్ళాలంటే బెంగగా అనిపించింది. అచ్చమ్మ భాగా ఉషారు చేసింది.

"ఏంటీ మరీ దిగాలుపడతావు? ఆడినేసుకుని వస్తే నువ్వేం చూస్తావక్కడ. సల్లగా మా అప్పకాడుంటాడు. పాలలో ఇంత నల్లమందేసి పడుకోబెడతదిలే" అంది.

నిజమే, పిల్లాడ్ని చంకలో వేసుకుని తను నాలుగడుగులు కూడా వెయ్యలేదు. అందుకే సరేనంది.

సర్రున బస్సు దూసుకుని ముందుకు పోతుంటే దేశాలు జయించి ముందుకు సాగిపోతున్న మహావీరుడిలా నాగమ్మ పొంగిపోయింది. ఆమె చేతులలో ఇరవై రూపాయిల నోటు చెమటకు తడిసి ముద్దయింది. దాన్ని జాగ్రత్తగా ఆరబెట్టి అచ్చమ్మ దగ్గరున్న బెత్తెడు పర్సులో దాచింది. ఆ బెత్తెడి పర్సూ అచ్చమ్మ బిగువైన గుండెల్లో గుత్తంగా వొదిగి కూర్చుంది.


కృష్ణ ఒడ్డున జాతర కలకల్లాడిపోతోంది. కృష్ణలో నీటికంటే ఇసుక పర్రే ఎక్కువ. అక్కడక్కడ గుంటల్లా నీరు కనిపించేసరికి అందరికీ కాశీలో గంగను చూసినంత ఆనందం కలిగింది. దానికి కారణం మరేమీ కాదు. నడినెత్తిమీద నిప్పులు గుమ్మరిస్తూ నాట్యం చేస్తున్నాడు సూర్యుడు. ఒకపక్క రంగుల రాట్నాలు, మరోపక్క ఎడ్ల పందాలు, వేరొకపక్క నృత్యాలు- సంగీతాలు. అన్నిటికీ మించి టిక్కెట్టు లేకుండా సినిమాలు, సినిమా హంగులతో రాజకీయ నాయకుల బొమ్మలు. తాడిచెట్టంత ఎత్తున గీతాబోధ- రావిచెట్టంత రాముడు- నాగలి దున్నే రైతన్న. ఒకటేమిటి నాగమ్మ అవన్నీ నోరు తెరుచుకునే చూసింది. ఆమెకంతా ఆశ్చర్యమే. ఏదో తెలియని వింత ఆనందమే. ఆమె తనని తనే మరిచిపోయింది. ఆకలి, దప్పిక మరిచి పన్నెండింటివరకు తిరిగాక కాళ్ళు పడిపోయాయి, నోరెండి పోయింది. కడుపులో ఆకలి నకనకలాడి పోతోంది. అచ్చమ్మ, నాగమ్మలతో బాటుగా కలిసి వచ్చినందరూ అన్నం కోసం చూశారు.

చివరికి పులిహోర పొట్లం అందరికీ తలొకటి సంపాదించి ఆవురావురుమంటూ విప్పితే అది పాసిపోయి వాసనగా వుంది- అది ఎలా తినాలో తెలీక, చూస్తూ అవతలెలా పారెయ్యాలో తోచక తికమకపడిపోయారు. మళ్ళీ తిరిగి పెరుగు అన్నం ప్యాకెట్లు ఒక్కొక్కటీ రూపాయి చొప్పున కొనుక్కుని తిని అర్థాకలి కడుపుని ఆ మేరకు మంచినీళ్ళతో నింపుకున్నారు. 'అయినా తిండి దేముంది' అని సరిపెట్టుకుని స్వేచ్ఛగా తిరగడం మొదలుపెట్టి, అన్నీ చూశారు.

సాయంత్రానికి నాగమ్మకి రొమ్ములో పాలుండి రాత్రికి జ్వరమొచ్చినట్లయింది. దానితోబాటుగా బిడ్డ గుర్తుకొచ్చి భరించలేని బెంగ వచ్చేసింది. కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

కూర్చుందుకు కూడా స్థలం లేదు. పడుకునేందుకు ఎక్కడినుంచి వస్తుంది? ఎండ వడగాడ్పులు కొట్టి ముఖాలు నల్లగా మాడిపోయాయి.

మర్నాడు మంచినీళ్ళూ దొరకలేదు. వరద నీరులా జనం పెరిగిపోవడంతో ఆవరణంతా కిటకిటలాడి



పోయింది. నిలబడే స్థలం లేకుండాపోయింది. ఈ జనాన్ని చూసి సూర్యుడు కూడా మరింత ఉత్సాహపడి నిప్పులు కురిపించాడు.

మళ్ళీ చూసిందే చూసేందుకు నాగమ్మలో ఉత్సాహం చచ్చిపోయింది. పిల్లాడిమీద బెంగ, రొమ్ములో తీపు ఆమెను నిలువనీయలేదు. వెంటనే ఇంటికెళ్ళి పోవాలనిపించింది. చేతిలో డబ్బులు సోడాలకీ, చాలీ చాలని అన్నాలు కొనుక్కు తినడానికీ అయిపోయాయి. మిగిలిన చిల్లర డబ్బులు కొంగున కట్టుకుంది.

''ఎల్లిపోదారే అచ్చం'' అంది. అచ్చమ్మ పకపకా నవ్వింది. ''మనిష్టమేనేంటి ఎల్లిపోడానికి? ఆళ్ళు బస్సెయ్యాల- మనవెళ్ళాల'' అంది.

''ఎప్పుడు?'' అంది నాగమ్మ నిస్పృహగా.

''ఇయ్యాల సాయింత్రం మీటింగుందిగా, అదయి నాక-'' అంది.

''మనకెందుకా మీటింగు? మనం పోదాం'' అంది నాగమ్మ.

''మనకొద్దు మీటింగు- నిజవే, కానీ ఆళ్ళ మీటింగుకి మనం కావాలి'' అంది.

''అంటే?''

''నీకు తెల్దులే'' అని మాట తుంచేసింది అచ్చమ్మ.

ఇసుక వేస్తే రాలని జనం- ఒకటే జనం. ఓ మూల అలసిపోయి అచ్చమ్మ బృందం కూర్చున్నారు. నాగమ్మకి నిద్ర కూరుకుపోతోంది. ఒళ్ళంతా హూనమైపోయింది. ఆకలి, అలసట ప్రాణాలు తోడేస్తున్నాయి.

ఎవరెవరో మాట్లాడుతున్నారు? రెండు నిమిషాల కొకసారి చప్పట్లు ఆకాశానికి అంటుతున్నాయి.

నాగమ్మ మాత్రం కళ్ళు మూసుకుని అచ్చమ్మ భుజం మీద తల ఆన్చింది. ఆ కళ్ళలో కన్నబిడ్డ కనిపించాడు. మిన్ను విరిగి మీద పడినట్లు మోగిన కరతాళ ధ్వనికి ఉలిక్కిపడి లేచింది.

మీటింగ్ అయిపోయింది.

అచ్చమ్మ అప్పగారింటికి అరమైలు దూరంలో బస్సు వీళ్ళని దింపింది. అచ్చమ్మ నడిచింది గాని నాగమ్మ పరుగే పెట్టింది. ఆ కన్నతల్లి పేగు మెలికలు పడి గుండెలు లాగేస్తోంది.

అనుకున్నంతా అయింది. అచ్చమ్మ అప్ప బిడ్డని ఒళ్ళో వేసుకుని ఆరుబయట కూర్చుంది. ఆమె చుట్టూ ఆడ-మగా దిగాలుగా కూర్చున్నారు. నాగమ్మని చూడగానే అచ్చమ్మ అప్ప గొల్లుమంది. నాగమ్మ నిలువునా కూలిపోతూ పిల్లాడ్ని చేతుల్లోకి తీసుకుంది. ఆ పసికందు మంచుముద్దలా వున్నాడు. ''ఓరి నాయనో'' అంటూ నాగమ్మ పసివాడ్ని గుండెల కదుముకుంది. రొమ్ము తీసి పిల్లాడి నోట్లో కుక్కబోయింది. బిగుసుకున్న నోరు తెరుచుకోలేదు.

''ఓ నా తల్లో, నీ విట్టా వెళ్ళావు. నీ బిడ్డ మొండికేసి ఏడుపు లంకించుకున్నాడు. మంచి నీళ్ళు ముట్టలేదు. పాలు తాగలేదు. ఏడుపాప లేదు. ఎవరి చేతుల్లో నిలవలేదు. ఓలమ్మో... నేనెంత పాపం చేశానో నాయనో! నాకేంటి తెలుసు, ఏదో కాస్త ఏడుస్తాడులే ఊరుకోబెట్టలేకపోతామా అనుకున్నాను. ఓ నా తల్లో! నే సూడను పొమ్మంటే నీ బిడ్డ నీకాడనే వుండేవాడు గందా! ఇంత రాత నా తలన దేవుడు రాశాడని నాకు తెలియదు దేవుడో!'' అచ్చమ్మ అప్ప గొంతు చించుకుని, జరిగిన కథ శోకాలతో చెప్తోంది. పిల్లవాడు కొత్తవాళ్ళ దగ్గర వుండక ఏడ్చి ఏడ్చి గొంతు ఎండి, గుక్క పట్టి తిప్పకోలేక చచ్చిపోయాడు.

''అక్కడేమిటి జరిగింది? ఆడవాళ్ళు వెళ్ళడానికేముంది?'' ఎవరో అన్నారు.

''అక్కడేం జరిగిందో ఆ జాతర పెట్టినవాళ్ళకు కూడా తెలియదు.''

నాగమ్మ ఒక్కసారి బిడ్డకేసి చూసింది. వాడెప్పుడో అమ్మమీద కోపమొచ్చి ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

'ఈ బాధను నే నెలా భరించను? నా మొగుడికి మొగమెలా చూపించను? అత్త ముందెలా నిలవను- అయ్య నన్ను చంపేస్తాడు- అమ్మ నా పీక పిసికేస్తుంది. అందరూ నన్ను... నన్ను... నన్ను...'' నాగమ్మ కళ్ళు మూతలు పడిపోయాయి. ఆమె పక్కకి ఒరిగిపోయింది.

●